క్లుప్తంగా

సబ్సిడీ విత్తనాలు వినియోగించుకోవాలి

అయిజ: రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న వేరుశనుగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ చైర్మన్ సుధాకర్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. అయిజ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్‌లో శనివారం సభ్యత్వం తీసుకున్న రైతులకు 2025– 26 సంవత్సరానికి సంబంధించి జాతీయ నూనె గింజల పథకం ద్వారా 100 శాతం రాయితీపై ఒక్కొక్క రైతుకు 30 కేజీల విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



శాంతినగర్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబ సభ్యులను ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు శుక్రవారం పరామర్శించారు. వడ్డేపల్లి మండలం కొంకలకు చెందిన బెలగంటి సత్యనారాయణరెడ్డి మనవడు హృషికేశ్‌రెడ్డి ఈ నెల 20న కర్నూలులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో కర్నూలులో సత్యనారాయణరెడ్డి కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో హరికృష్ణారెడ్డి, పుల్లూరు నాగేశ్వర్‌రెడ్డి, వావిలాల రంగారెడ్డి, బాలకృష్ణారెడ్డి, నీలప్ప, రఘురెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో హెల్త్ క్యాంప్



అయిజ: స్వస్తనారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గైనకాలజీ, ఎముకలు, చెవి, ముక్కు, గొంతు, సైకాలజీ, స్త్రీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 300 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ అధికారి విష్ణు, డాక్టర్ కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలని నిరసన



వీపనగండ్ల: అయిదు నెలలుగా రావాల్సిన బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ.. శుక్రవారం గోపల్‌దిన్నె ఫిల్టర్‌బెడ్స్ వద్ద మిషన్ భగీరథ కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. చల్లా కంపెనీలో పని చేస్తున్న తమకు జీతాలు ఇప్పించాలని కోరిన కంపెనీ యాజమాన్యం స్పందించని నేపథ్యంలో నిరసనగా ధర్నా చేపట్టినట్లు తెలిపారు. వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కోకన్వీనర్ ఆశన్న అధికారులకు విజ్ఞప్తి చేశారు. మిషన్ భగీరథ ఎస్ఈ వెంకట్రాములు, డీఈ అమిత్‌కుమార్ కార్మికులతో మాట్లాడి బకాయి వేతనాలను ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్మికులు బత్తుల రాముడు, లోకనాయుడు, వెంకటయ్య, మహేశ్, రాఘవేందర్, రవి, నరేష్, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

పాన్‌గల్: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికైనట్లు జీహెచ్‌ఎం విజయలక్ష్మి, పీడీ శ్యామల శుక్రవారం తెలిపారు. పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థినులు సాయిపూజ, శృతి జూనియర్ విభాగంలో ఎంపికైనట్లు తెలిపారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

29న ఉమ్మడి జిల్లాస్థాయి భజన పోటీలు

చిన్నచింతకుంట: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మండలంలోని కురుమూర్తిలో ఈ నెల 29న ఉమ్మడి జిల్లాస్థాయి భజన పోటీలు నిర్వహించనున్నట్లు వీరాంజనేయ భజన మండలి సభ్యులు శుక్రవారం తెలిపారు. భజన పోటీలను దుర్గాదేవి మండపం వద్ద నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గ్రామాల్లో తాగునీటి కష్టాలు

- అందని మిషన్ భగీరథ నీరు
- ఉప్పునీళ్లే దిక్కంటున్న ప్రజలు
- మొరపెట్టుకున్నా పట్టని అధికారులు

శాంతినగర్: ఇంటింటికి కుళాయిల ద్వారా ఫిల్టర్ నీటిని అందించి ప్రజలు రోగాల బారిన పడకుండా చూడాలనే ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. పైప్‌లైన్ లీకేజీలు, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే తాగునీటి కష్టాలు ఏర్పడుతున్నాయని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒకవైపు వర్షాలు కురుస్తుండటం మరోవైపు ఫిల్టర్ నీరు అందక అవస్థలు పడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు.

రెండు రోజులకోసారి

వడ్డేపల్లి మండల పరిధిలోని రామాపురం, కొంకల, జూలెకల్ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. ఆయా గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా మిషన్ భగీరథ నీటిని అందిస్తోంది ప్రభుత్వం. గత రెండు నెలలుగా ఆయా గ్రామాల్లోని పెద్ద ట్యాంకుల నుంచి సరఫరా అయ్యే ఫిల్టర్ నీరు పూర్తి స్థాయిలో రాకపోవడం, రెండు రోజులకోసారి రావడం జరుగుతోంది. వానాకాలంలో తాగునీటి సమస్య తలెత్తడమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రెండు ఏర్లు నిండుగా ప్రవహిస్తున్నా తాగునీటి ఇబ్బందులు ఏంటని ప్రభుత్వం అధికారుల తీరును ఎండగడుతున్నారు.

ఉప్పునీళ్లు తాగాల్సిన దుస్థితి

ఓవర్‌హెడ్ ట్యాంకుల ద్వారా సరఫరా అయ్యే మిషన్ భగీరథ నీరు సరిగా రాకపోవడంతో ఆయా గ్రామాల్లోని సంపులకు బోర్‌బావుల ద్వారా సరఫరా చేసే ఉప్పు నీళ్లే దిక్కవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. అంతేగాక ప్రైవేట్ బోరు బావుల్లోని నీటిని అడిగి తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రామాపురంలో పూర్తి స్థాయిలో నిండని ఓవర్‌హెడ్ ట్యాంక్

లీకేజీలు సరిచేయక

మల్దకల్ మండలం మల్లెందొడ్డి శివారులోని పెద్ద ట్యాంకు నుంచి వడ్డేపల్లి మండల పరిధిలోని ఆయా గ్రామాలకు మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతుంది. సుమారు 20 కిలో మీటర్ల దూరం నుంచి పైప్‌లైన్ల ద్వారా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఓవర్‌హెడ్ ట్యాంకులకు సాగునీరు సరఫరా చేస్తారు. కిలో మీటర్ల పొడవున ఎక్కడ లీకేజీ అయినా దిగువన ఉన్న గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వర్షాలు కురుస్తున్న వేళ ఫిల్టర్ నీటిని సరఫరా చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ట్యాంకులు నిండటం లేదు

ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన 40 వేలు, 90 వేల లీటర్ల ఓవర్ హెడ్ ట్యాంకులను మిషన్ భగీరథ నీటితో నింపకపోవడంతో తాగునీటి సమస్య తలెత్తుతోంది. గత రెండు నెలలుగా మిషన్ భగీరథ అధికారులు, ఎంపీడీఓలకు తాగునీటి సమస్య విన్నవించినా ఫలితం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మూడు నెలలుగా సమస్య



మిషన్ భగీరథ నీరు రాక ముందు ఏర్పాటు చేసిన మినీ ట్యాంకుల్లోని ఉప్పు నీళ్లే మాకు దిక్కవుతున్నాయి. మూడు నెలలుగా మిషన్ భగీరథ కుళాయిల నీరు సరిగా రావడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి ఫిల్టర్ నీరు సరఫరా చేయాలి. – అమీనాబీ, రామాపురం, వడ్డేపల్లి

కొనుక్కోవాల్సిన పరిస్థితి



గతంలో ఫిల్టర్ నీళ్లు ప్రతి రోజు వచ్చేవి. ఇప్పుడేమో రెండు రోజులకోసారి వస్తున్నా యి. వచ్చే నీళ్లు కూడా తాగడానికి సరిపోవడం లేదు. వాటర్ క్యాన్లు కొనుక్కొని తాగుతున్నాం. పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా చేసి రోగాల బారిన పడకుండా చూడాలి. – శారద, రామాపురం, వడ్డేపల్లి మండలం

సమస్య పరిష్కరిస్తాం..

మిషన్ భగీరథ నీరు గ్రామాల్లో రోజు సరఫరా అవుతున్నాయి. ట్యాంకు లు కూడా నింపుతున్నాం. పండగల సమయంలో తా గునీటికి ఇబ్బంది తలెత్తుతుది. వాటర్‌మెన్‌ల ద్వారా సమాచారం సేక రించి సమస్య పరిష్కరించేందుకు కృషిచేస్తాం. – తేజవర్ధన్, ఏఈ, మిషన్ భగీరథ

వీరనారి చాకలి ఐలమ్మ



ధరూరులో చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, తదితరులు

సాక్షి నెట్‌వర్క్: భూస్వాముల దోపిడి, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఉప్పేరు నర్సింహ అన్నారు. శుక్రవారం చాకలి ఐలమ్మ 130వ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నర్సింహ మాట్లాడుతూ ఐలమ్మ చూపిన అడుగుజాడల్లో ముందుకు సాగడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో తిమ్మప్ప, అంజి, రంగన్న, లక్ష్మణ్, జయమ్మ, పద్మ, కొండన్న తదితరులు పాల్గొన్నారు.

■ గట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కేఎస్‌డీ రాజు ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీదేవి, రాఘవేంద్ర, జయరాజు, అయేషా, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

■ ధరూరు మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం బీఆర్ఎస్ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంతునాయుడు, గద్వాల మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సరిత నాయకులతో కలిసి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్‌రెడ్డి, డీఆర్ శ్రీధర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అలంపూర్‌లో చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

■ తెలంగాణ తెగువను ప్రపంచానికే చాటి చెప్పిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని రాష్ట్ర చాకలి ఎస్సీ సాధన సమితి అధ్యక్షురాలు కొత్తకొండ్ల లక్ష్మి అన్నారు. శుక్రవారం ఇటిక్యాల మండల పరిధిలోని ఉదండాపురంలో ఐలమ్మ నూతన విగ్రహావిష్కరణకు హాజరై పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కేంద్రంలో రజక సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి నివాళ్ళురించారు.

■ మానవపాడు మండల కేంద్రంలోని ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన సేవలు కొనియాడారు.

■ చాకలి ఐలమ్మ స్ఫూర్తి అందరికీ ఆదర్శమని రజక సంఘం నాయకులు కొనియాడారు. అలంపూర్ పట్టణంలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రామయ్యశెట్టి, వేణు, ప్రశాంత్, రంగన్న తదితరులు పాల్గన్నారు.



ఉదండాపురంలో నివాళులర్పిస్తున్న నాయకులు



జిల్లా కేంద్రంలో నివాళులర్పిస్తున్న నాయకులు

■ ఉండవెల్లి మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి హెడ్ కానిస్టేబుల్ వీరన్న, పంచాయతీ కార్యదర్శి బాషా, రజకసంఘం మండల అధ్యక్షుడు రవి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నరహరి, చిన్న కొండన్న, సుంకన్న, శ్రీను, సాములు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ



ఆత్మకూర్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రహ్మతుల్లా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పరమేష్, తులసిరాజ్, శ్రీను అందజేశారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో తిప్డంపల్లి గ్రామానికి చెందిన 17 మందికి మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీపాద్, ఎంపీఓ శ్రీరాంరెడ్డి, నాయకులు రఫీ, షాలం, సాయి రాఘవ, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన విద్య



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సైదులు

ఆత్మకూర్: ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన విద్య అందుతుందని ప్రిన్సిపాల్ సైదులు అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలను సాధించి దేశం గర్వించే స్థాయికి ఎదగాలన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా పేరెంట్స్‌డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కళాశాలలో మెరుగైన విద్యతోపాటు మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు భాగ్యవర్ధన్‌రెడ్డి, టీజే విశ్వేశ్వర్, జమ్మన్న, రాఘవేందర్‌రావు, శ్వేత, వీణ, లలితమ్మ, ఏకే కురుమూర్తి సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో



జిల్లా కేంద్రంలో బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

గద్వాలన్యూటౌన్/గట్టు: బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ విద్యార్థులు ఆడి పాడారు. శుక్రవారం స్థానిక నర్సింగ్ కళాశాలలో బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి అధ్యాపకులు, విద్యార్థినుల కోలాటాలతో బొడ్డెమ్మలు వేస్తూ ఉత్సాహంగా ఆడిపాడారు.

■ గట్టులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుక ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మ ఆడారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కేఎస్‌డీ రాజు, అధ్యాపకులు శ్రీదేవి, నినావత్‌లాల్, రాఘవేంద్ర, అయేషా తదితరులు పాల్గొన్నారు.



గట్టు కాలేజీలో బతుకమ్మ సంబరాలు

వంతెన పనులు పూర్తి చేయాలి

అయిజ: మండల కేంద్ర సమీపంలో పోలోనివాగుపై హైలెవల్ వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం బీజేపీ నాయకులు పోలోనివాగును పరిశీలించి మాట్లాడారు. అయిజ– ఎమ్మిగనూరు అంతర్రాష్ట్ర రహదారిపై వంతెన నిర్మాణం పూర్తికాకపోవడంతో వర్షం కురిసిన ప్రతిసారి రాకపోకలు నిలిచిపోతున్నాయన్నారు. అంబులెన్స్ వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వంతెన నిర్మాణం పనులు వెంటనే పూర్తి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరయ్యచారి, లక్ష్మణ్‌గౌడ్, నాగరాజు, వీరేష్‌గౌడ్, రాజశేఖర్, ఖుషి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



పోలోనివాగు వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



బీచుపల్లి పుష్కరఘాట్ల వద్ద వరద ఉధృతి

ఎర్రవల్లి: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇటిక్యాల ఎస్ఐ రవినాయక్ సూచించారు. శుక్రవారం బీచుపల్లి పుష్కరఘాట్ వద్ద కృష్ణానదికి వస్తున్న వరద ఉధృతిని ఆయన పరిశీలించి మాట్లాడారు. పుష్కరఘాట్ల వద్ద నీటిలోకి దిగరాదన్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో నివసించే మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని పేర్కొన్నారు. విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని, పాడుబడిన ఇండ్లలో ఉన్నవారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. వాగులు, వంకలను దాటేటప్పుడు ప్రయాణికులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కేటీదొడ్డి: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం యాపల్‌దిన్నెకు చెందిన సవారన్న యాపల్‌దిన్నె నుంచి మండలంలోని ఇర్కిచేడు వైపు వస్తున్న సమయంలో గ్రామ శివారున పోలీసులు తనిఖీ చేశారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.





బీచుపల్లిలో ధనలక్ష్మీదేవి అవతారంలో దుర్గామాత



బీచుపల్లి కోదండరామస్వామి ఆలయంలో..



చాగాపురంలో మహాలక్ష్మిగా అమ్మవారు



మల్దకల్‌లో మహాలక్ష్మి అలంకరణలో..



మల్దకల్ మార్కండేయ స్వామి ఆలయంలో..

పాహిమాం.. మహాలక్ష్మి

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శుక్రవారం భక్తులకు లక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

■ ఇటిక్యాల మండలంలోని పెద్దదిన్నె వేంకటేశ్వరస్వామి ఆలయం, చాగాపురం భవానీయూత్, షాబాద్ శివాజీయూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద మహాలక్ష్మి అలంకరణలో దుర్గామాత భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

■ మానవపాడు మండల కేంద్రం, చెన్నిపాడు, అమరవాయి గ్రామాల్లో ఘనంగా నవరాత్రి ఉత్సవా లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రత్యేక పూజల అనంతరం అన్నదానం చేశారు.

■ అయిజ మండలంలోని వివిధ గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

■ గట్టు మండల కేంద్రంలోని కాళీకాదేవి ఆలయం, గొర్లఖాన్‌దొడ్డిలో అమ్మవారు ధనలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. నైవేద్యంగా చక్కెర పొంగలి, పూర్ణాలను భక్తులు సమర్పించారు.

■ మల్దకల్‌లోని వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో మహాలక్ష్మీదేవిగా వాసవీమాత భక్తులకు దర్శనమిచ్చారు. మార్కండేయస్వామి ఆలయం, ఆదిశిలా క్షేత్రం, ఎల్కూరు, బూడిదపాడు, బిజ్వారంలో అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయాల ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు బాదం శ్రీనివాసులు, మనసాని నాగరాజు, వెంకటేశ్‌శెట్టి, రాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

■ ధరూరు మండల కేంద్రంలోని కాళికాదేవి ఆలయంలో కోటయూత్ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, కలశపూజ, గణపతి పూజ, బిల్వార్చన వంటి క్రతువులు నిర్వహించారు.

■ రాజోళిలోని అంబాభవానీమాత ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమార్చన, భజనలు, సంకీర్తనలతో పూజలు చేశారు.

■ ఎర్రవల్లి మండలం బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో దుర్గామాత ధనలక్ష్మి (రూ.1,50,116) అవతారం, కోదండరామస్వామి ఆలయంలో జ్ఞాన సరస్వతీదేవి (రూ.11,00,116) లక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

■ ఉండవెల్లి మండలంలోని కంచుపాడు, ప్రాగటూరు గ్రామాల్లో అమ్మవారు లక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ప్రాగటూరులో నగదులో అమ్మవారిని సుందరంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



శాంతినగర్‌లో సామూహిక కుంకుమార్చన పూజలు చేస్తున్న మహిళలు



రాజోళిలో భజనలు చేస్తున్న మహిళలు



ధరూరులో..



అయిజ కాళికాదేవి ఆలయంలో..



ఉండవెల్లి మండలం ప్రాగటూరులో..